క్లుప్తంగా

వృద్ధులకు కంటి పరీక్షలు



వృద్ధురాలికి కంటి పరీక్ష చేస్తున్న వైద్యురాలు

తాడిపత్రి టౌన్ : స్థానిక మెయిన్ బజార్ ఆర్వీ స్వామి కల్యాణ మండపంలో శనివారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 400 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 300 మంది శస్త్ర చికిత్సకు ఎంపిక చేసినట్లు వాసవీక్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. శస్త్ర చికిత్సకు ఎంపికైన వారికి బెండళూరు శంకర్ కంటి ఆస్పత్రికి ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు. బెంగళూరు శంకర్ కంటి ఆస్పత్రి, తాడిపత్రి వాసవీ క్లబ్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శిబిరం జరిగింది. క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ భూమా సూర్యనారాయణ, టీసీసీ చైర్మన్ బండారు శివ కుమార్, రీజనల్ సెక్రటరీ శ్యాం ప్రసాద్, సభ్యులు పెద్దమద్దిలేటి, సుబ్బరత్నయ్య, సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్ థామస్ మన్రో జయంతి



మన్రో సమాధి వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని కోటలో ఉన్న సర్ థామస్ మన్రో సమాధి వద్ద గౌతమ్ బుద్ధ అభివృద్ధి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో శనివారం మన్రో 262వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మన్రో సమాధిపై పుష్పాలు చల్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ బాబు సర్ థామస్ మన్రో గొప్పతనాన్ని వివరించారు. సమాఖ్య సభ్యులు ప్రజా వైద్య శాల ఇస్మాయిల్, చాంద్‌బాషా, రామదాసు, మల్లికార్జున, గుత్తి కోట సిబ్బంది, గైడ్ పాల్గొన్నారు.

బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన



బహిరంగ సభ ఏర్పాట్లపై రూరల్ ఎస్ఐతో చర్చిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి టౌన్: ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ యాత్ర ముగింపు సందర్భంగా స్థానిక కడప రోడ్డులోని గన్నేవారిపల్లి కాలనీలో సోమవారం జరగనున్న బహిరంగ సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పరిశీలించారు. తాడిపత్రి రూరల్‌లో ఈనెల 15 నుంచి ప్రజా సంక్షేమ యాత్ర ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో బహిరంగ జరిగే స్థలాన్ని రూరల్ ఎస్ఐ, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో పరిశీలించడంతోపాటు ఏర్పాట్లపై చర్చించారు. బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని హర్ష పిలుపునిచ్చారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

నీటి వనరులను సంరక్షించుకోవాలి

బుక్కరాయసముద్రం: రైతులు నీటి వనరులను జాగ్రత్తగా సంరక్షించుకోవాలని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. శనివారం శింగనమల మండలం సోదనపల్లిలో రెడ్డిపల్లి కేవీకే, లైఫ్ మిషన్ వాతావరణ దినోత్సవం సందర్భంగా నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వర్షం నీటిని వృథా చేసుకోకుండా చెక్ డ్యాంల ద్వారా సంరక్షించుకోవాలన్నారు. నీటి సేకరణ, చెక్ డ్యాం, నీటి కుంటల నిర్మాణాలు వాటితో ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అనంతరం కంది, వేరుశనగ, పెసర పంటల్లో నూతన వంగడాల గురించి తెలియజేశారు. కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుధారాణి, వ్యవసాయ విస్తరణా శాస్త్రవేత్త డాక్టర్ చందన, నవీన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహిమ సువార్త మహాసభలు



అతిథులను ఆశీర్వదిస్తున్న పాస్టర్ అద్భుతకుమార్

గుత్తి: పట్టణంలోని బైబిల్ మిషన్ (స్వస్థత శాల) చర్చిలో మూడు రోజులుగా బైబిల్ మిషన్ పాస్టర్ రెవరెండ్ అద్భుతకుమార్, మణికుమారిల ఆధ్వర్యంలో జరుగుతున్న మహిమ సువార్త మహాసభలు శనివారం ముగిశాయి. గుత్తి మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, ఎంపీపీ విశాలాక్షి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంజునాథరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పాస్టర్ అద్భుత కుమార్, మణికుమారి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వలంటీర్ల పనితీరు అద్భుతం



పురస్కారాలందుకున్న వలంటీర్లతో పైలా, ఆలూరు సాంబశివారెడ్డి

యల్లనూరు: గ్రామ వలంటీర్లు అందిస్తున్న సేవలు అద్భుతమని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య పేర్కొన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వారు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ గంగాదేవి, సర్పంచులు అశోక్‌కుమార్ రెడ్డి, రామాంజులరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పెద్ద ఓబులమ్మతో కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలూరు సాంబశివారెడ్డి, పైలా నరసింహయ్య మాట్లడుతూ ప్రభుత్వ సేవలకు చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. అర్హతే ప్రామాణికంగా నవరత్న పథకాలను ప్రజలకు చేరవేయడంలో వాలంటీర్లు ముఖ్య పాత్ర పోషిస్తున్నారన్నారు. కరోనా లాంటి సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించారని గుర్తు చేశారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలు ప్రజల సొమ్మును దోచుకున్నాయన్నారు. వాటి సిఫారసు లేకుంటే ప్రభుత్వ పథకాలు అందేవికావని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎలాంటి అవినీతి లేకుండా రూ.కోట్లు ప్రజల బ్యాంకు ఖాతాల్లో జమవుతున్నాయన్నారు. జగనన్నకు ప్రజల్లో వస్తున్న ఆదరణ ఓర్వలేక పచ్చమీడియా ఆయనపై బురదజల్లేందుకు యత్నిస్తోందన్నారు. ప్రజలు దష్టుచతుష్టయం కుట్రలు తప్పికొడతారని పేర్కొన్నారు. సచివాలయ మండల కన్వీనరు ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దార్ రమాదేవి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొండన్న, పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

పెద్దవడుగూరు : వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సీఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం కాశేపల్లి టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కారు డ్రైవర్లు తప్పకుండా సీట్ బెల్టు పెట్టుకోవాలని సూచించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపడం వలన కలిగే నష్టాలను వివరించారు. పరిమితికి మించి జనాలను ఎక్కించుకోవద్దని ఆటో డ్రైవర్లకు సూచించారు.

అస్సాం యువకుడిపై పోక్సో కేసు నమోదు

గార్లదిన్నె: అస్సాంకు చెందిన ఓ యువకుడిపై శనివారం పోక్సో కేసు నమోదు చేశారు. శనివారం ఎస్ఐ సాగర్ వివరాల మేరకు.. అస్సాంకు చెందిన పప్పుబాగ్ అలియాస్ (రాజు) అనే యువకుడు గార్లదిన్నె డ్యాం రోడ్డు మోడల్ స్కూల్ వెళ్లే దారిలో ఉండే కూరగాయాల మండిలో కొంత కాలంగా పనిచేస్తూ ఇందిరమ్మ కాలనీలో బాడుగ ఉండేవాడు. అలాగే పేపర్లు ఎరుకొని జీవనం సాగించే ఉరవకొండకు చెందిన ఓ కుటుంబం ఇందిరమ్మ కాలనీలో గుడిసె వేసుకుని ఉండేవారు. ఈక్రమంలో పప్పు బాగ్ బాలికపై లైంగిక దాడి చేశాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు డీఎస్పీ వెంకటశివారెడ్డి విచారణ చేసి యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రామగిరిలో భూ సమగ్ర సర్వే

పామిడి: రామగిరి గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ జీ లక్ష్మినారాయణరెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వేయర్ మురళీధర్ శనివారం వైఎస్సార్,జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష కింద సర్వే చేపట్టారు. ఈసందర్భంగా గ్రామస్తులకు సర్వేపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మిదేవి, ఆర్ఐ క్రాంతికుమార్, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న డీఎస్పీ నరసింగప్ప

గుంతకల్లుటౌన్: సైబర్ మోసాలు, చైన్‌స్నాచింగ్‌లు, చోరీలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప సిబ్బందికి సూచించారు. శనివారం స్థానిక వన్‌టౌన్ పీఎస్‌లో పట్టణంలోని నాలుగు పోలీస్‌స్టేషన్ సిబ్బంది, వార్డు మహిళా పోలీసులతో కాఫీ విత్ మెన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలన్నారు. పోలీస్ కానిస్టేబుళ్లకు కేటాయించిన వార్డులు, గ్రామాల్లో ముందస్తు సమాచారాన్ని రాబట్టి ఉన్నతాధికారుల ఆదేశానుసారం నేరాల అదుపునకు కృషి చేయాలన్నారు. పోలీసు సిబ్బంది, వార్డు మహిళా పోలీసులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. వరకట్న వేధింపులు, బాలికలపై దాడులు, అఘాయిత్యాలు జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టాలని తెలిపారు. ప్రజలతో మర్యాదగా మెలుగుతూ అంకితభావం, సేవా దృక్పథంతో పనిచేసి పోలీసు ప్రతిష్ఠ పెంచాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు. సీఐలు రామసుబ్బాయ్య, గణేష్, ఎస్ఐలు సురేష్, నరేంద్ర, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వలంటీర్లకు పురస్కారాలు

గార్లదిన్నె: ఎగువపల్లి వైఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం వలంటీర్లకు పురస్కారాలు అందించనునన్నట్లు ఎంపీడీఓ తేజోత్స్న పేర్కొన్నారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఎంపీ తలారి రంగయ్య, రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ హాజరవుతారన్నారు. అధికారులు, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

దొంగ అరెస్టు.. చోరీ సొత్తు స్వాధీనం

తాడిపత్రి టౌన్ : పట్టణ పోలీసులు చోరీ కేసులో దొంగను అరెస్ట్ చేసి సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. పట్టణ సీఐ ఆనందరావు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. పట్టణం శ్రీనివాస పురానికి చెందిన వెంకటలక్ష్మీ, రాజగోపాల్ నాయుడు వారం క్రితం ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వ్యవసాయ పనుల నిమ్మితం వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన ఉరవకుండ మండలం పెద్దకొకుంట్ల గ్రామానికి చెందిన ప్రకాష్ ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న 4 బంగారు గొలుసులు(47 గ్రాములు) దొంగలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. శనివారం నిందితుడు ప్రకాష్‌ను అరెస్ట్ చేశారు. ఎస్ఐ ధరణిబాబు, హెడ్‌కానిస్టేబుల్ రాఘవ, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తన వేరుశనగ పంపిణీ చేయాలి

గుంతకల్లు రూరల్: రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ నాయకులతో కలిసి కసాపురం ఆర్బీకే వేరుశెనగను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన వేరుశనగ నాణ్యత లేకపోవడం వల్ల దిగుబడులు తగ్గిపోతున్నాయన్నారు. దీంతో వేరుశనగ సాగు జిల్లాలో 26 లక్షల ఎకరాల నుండి 6 లక్షల ఎకరాలకు పడిపోయిందన్నారు. గతంలో మొలకశాతాన్ని పరీక్షించి నాణ్యమైన విత్తనకాయలను మాత్రమే పంపిణీ చేసేవారని, కానీ ప్రస్తుతం ప్రైవేటు కంపెనీ యజమానులే స్వీయధ్రువీకరణ పత్రాలను అందజేస్తూ ప్రభుత్వానికి నాసిరకం విత్తనకాయలను విక్రయిస్తున్నారన్నారు. నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, మండల కార్యదర్శి రాము పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమాదేవి

శింగనమల: గ్రంథాలయాల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ఎల్ఎం ఉమాదేవి సూచించారు. శనివారం శింగనమలలోని గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును పరిశీలించారు. విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయాధికారి కృష్ణ ఉన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

తాడిపత్రి టౌన్: చిన్నతనం నుంచి పుస్తకపఠనం అలవర్చుకోవాలని గ్రంథాలయాధికారి రవికుమార్ నాయుడు విద్యార్థులకు సూచించారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా శనివారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి కథల పుస్తకాలు, మహానుభావుల జీవిత చరిత్రలు, సైన్స్, క్విజ్, పురాణాలు తదితర విశిష్టతను తెలిపారు.

గార్లదిన్నె: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఎల్ఎం ఉమాదేవి పేర్కొన్నారు. శనివారం గార్లదిన్నె గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థుల చేత కథల పుస్తకాలు చదివించడంతో పాటు కథలు చెప్పించారు. పిల్లలు చేసిన పేపర్ కటింగ్ చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రంథాలయ రికార్డులు పరిశీలించారు. గ్రంథాలయ అధికారిణి శిరీష తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ పాత్రికేయుడి మృతి



మస్తాన్‌వలి (ఫైల్)

గుంతకల్లుటౌన్: కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న గుంతకల్లుకు చెందిన సీనియర్ పాత్రికేయుడు మస్తాన్‌వలి(62) శనివారం సాయంత్రం మృతి చెందాడు. మస్తాన్ గతంలో ఆంధ్రప్రభ, వార్త తదితర దినపత్రికల్లో పనిచేశారు. మస్తాన్ మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు, పాత్రికేయులు సంతాపం తెలిపారు.

ఏటిగడ్డపాలెంలో బోరు, నీటి ట్యాంకుల ఏర్పాటు



బోరు తవ్వకాన్ని పారంభిస్తున్న ఫయాజ్‌బాషా

తాడిపత్రి టౌన్: స్థానిక ఏటిగడ్డపాలెంలో శనివారం ఫయాజ్ ట్రస్ట్ చైర్మన్ హీరాపురం ఫయాజ్ బాషా ఆధ్వర్యంలో నీటి బోరు వేసే కార్యక్రమం చేపట్టారు. ఏటిగడ్డపాలెంలో కొద్ది రోజులుగా నీటి సమస్య నెలకొంది. మంచి నీరు దుర్వాసన వస్తోందని కాలనీవాసులు సమస్యను ఫయాజ్‌బాషాకు తెలియజేశారు. ఆయన వెంటనే స్పందించి కాలనీలో నీటి సమస్య పరిష్కారానికి రూ1.7లక్షల వ్యయంతో నీటి బోరు, మోటర్, మూడు ట్యాంకుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ప్రజల దాహార్తి తీర్చడానికే బోరు వేస్తున్నట్లు ఫయాజ్‌బాషా తెలిపారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ షాషావలి, ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా, నాయకులు రియాజ్, హాజివలి, గురుప్రసాద్‌రెడ్డి, ఆలూరు ప్రసాద్‌రెడ్డి, ఇక్బాల్, రంగనాథ్, మహారాజ్, అగ్గిరవ్వ, వలి, బషీర్, నూర్, ఆర్డీ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డీటీ బాలమ్మ

యాడికి: ప్రతి ఒక్కరూ బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని డిప్యూటి తహసీల్దార్ బాలమ్మ సూచించారు. ఎంపీడీఓ సమావేశ భవనంలో శనివారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 ఏళ్లు, బాలురకు 21 ఏళ్లు నిండిన తరువాతే వివాహాలు జరిపించాలన్నారు. బాల్య వివాహాలు జరిపినా, ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హుసేనమ్మ, శంషాద్ బేగం, సచివాలయాల మహిళా పోలీసులు పాల్గొన్నారు.

యల్లనూరు: బాల్యవివాహాలు చిన్నారుల జీవితంలో విషం లాంటివని అంగన్‌వాడీ కార్యకర్త శివకామిని అన్నారు. మండల కేంద్రంలోని పాతపేట అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం బాల్యవివాహాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు ఎక్కడైనా పెళ్లి జరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 ళ్లు నిండిన అనంతరం వివాహం చేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సరిత, బీబీ పాల్గొన్నారు.

దళిత రైతు కుటుంబానికి న్యాయం చేయాలి

గుంతకల్లుటౌన్: నార్పల మండలం తుంపెరి గ్రామంలో కబ్జాకు గురైన దళిత రైతు పెద్దన్నకు చెందిన భూమిని తిరిగిని అతనికి ఇప్పించి ఆ రైతు కుటుంబానికి న్యాయం చేయాలని రాయలసీమ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ ప్రజా సేవాసంఘం అధ్యక్షుడు ఆలం నవాజ్, కార్యదర్శి మహేంద్ర, సలహాదారు గాలిమల్లికార్జున ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ప్రజా సేవా సంఘం కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. నార్పల తహసీల్దార్ వేధింపులు తాళలేకనే రైతు పెద్దన్న ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు రైతుకు న్యాయం చేయకపోతే ఆందోళనలు చేపడుతామన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నాం

బుక్కరాయసముద్రం: జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని మండల స్పెషలాఫీసర్, హౌసింగ్ డీఈ శ్రీమన్నారాయణ, తహసీల్దార్ మోహన్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం పొడరాళ్ల జగనన్న కాలనీలో పర్యటించారు. ముందుగా గ్రామంలో ఎన్ని లే అవుట్లు ఉన్నాయని, ఎంత మందికి ఇళ్ల పట్టాలు, జగనన్న గృహ నిర్మాణాలు మంజూరయ్యాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. పునాదులు ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. ఇళ్లు పూర్తి చేసిన లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించే విధంగా చర్యలు చేపడతామన్నారు. సర్పంచ్ ఎర్రిస్వామి, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఏపీఎం మద్దిలేటి, హౌసింగ్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ ప్రతాప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జనార్ధన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పామిడి: ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ లబ్ధిదారులకు సూచించారు. శనివారం ఆయన పట్టణంలోని జగనన్న కాలనీలో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులతో మాట్లాడారు. కాలనీలోని మౌలిక వసతులపై సమీక్షించారు. హౌసింగ్ ఏఈ అశ్వర్థ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పామిడి: రామరాజుపల్లి గ్రామ సమీపాన శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు.. గుత్తికి చెందిన గుత్తి నుంచి అకండ్‌బాషా, ఈదుర్‌బాషా బైక్‌పై పామిడి వైపుకు బయలుదేరారు. కాసేపల్లికి చెందిన వెంకటరామిరెడ్డి పామిడి నుంచి కాసేపల్లికి వస్తుండగా రామరాజుపల్లి వద్ద రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. అకండ్‌బాషా, ఈదుర్‌బాషాకు రక్తగాయాలయ్యాయి. వెంకట్రామిరెడ్డికి తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే వాహనంలో గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పామిడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళకు గాయాలు

గార్లదిన్నె: మండల కేంద్రంలోని శింగనమల క్రాస్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు గాయాలయ్యాయి. 108 సిబ్బంది వివరాల మేరకు.. కల్లూరు నుంచి వరలక్ష్మి అనే మహిళ బైక్‌పై మర్తాడుకు బయలుదేరింది. శింగనమల క్రాస్ వద్దకు రాగానే కారు ఎదురుగా రావడంతో బైక్ అదుపుతప్పి కిందపడడంతో వరలక్ష్మికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108లో ఆమెను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఇంటింటికీ రేషన్ పంపిణీ చేయండి

గుంతకల్లుటౌన్: ఇంటింటా రేషన్‌పంపిణీ చేయాలని గుంతకల్లు ఆర్‌డీఓ జె.రవీంద్ర ఎండీయూ ఆపరేటర్లు, రేషన్‌డీలర్లకు సూచించారు. శనివారం ఆర్‌డీఓ కార్యాలయంలో గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలోని సీఎస్‌డీటీలు, రేషన్‌డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమన్వయకమిటీ సమావేశాన్ని నిర్వహించారు. రేషన్‌కార్డుదారుల వేలిముద్రలు పడకపోతే ఐరిష్ తీసుకుని వారికి నిత్యావసరాలు అందజేయాలన్నారు. ఒకటో తేదీ ఉదయం 7 గంటల నుంచి సరుకుల పంపిణీని షురూ చేయాలని చెప్పారు. తూకాల్లో ఎలాంటి తేడాల్లేకుండా సక్రమంగా సరుకులివ్వాలన్నారు. కార్డుదారులకు జొన్నలు, రాగులు తప్పనిసరిగా అందించాలని తెలియజేశారు. గుంతకల్లు తహసిల్దార్ బి.రాము, గుత్తి, విడపనకల్లు, యాడికి, పామిడి, పెద్దవడుగూరు మండలాల సీఎస్ డీటీలు పాల్గొన్నారు.

సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎంపీడీఓ తేజోత్స్న

గార్లదిన్నె: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ వెంకటనారాయణ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. తహసీల్దార్ ఉషారాణి మాట్లాడుతూ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణాలు చేపట్టేలా ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ తేజోత్స్న మండల సర్వసభ్య సమావేశానికి అధికారులంతా తప్పక హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్‌రెడ్డి, మండల స్థాయి అధికారులు , సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు

- రోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు గుర్తింపు



స్వప్న నర్సింగ్‌హోమ్‌లో రోగులను విచారిస్తున్న ఆర్‌డీఓ రవీంద్ర

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులపై శనివారం రెవెన్యూ, ఆరోగ్యశాఖ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఆర్‌డీఓ జె.రవీంద్ర పర్యవేక్షణలో రెవెన్యూ, ఆరోగ్యశాఖ అధికారులతో కూడిన 15 బృందాలు పట్టణంలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు, ఫిజియోథెరపీ, స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీవేదా ఆస్పత్రికి అనుమతి, రిజిస్ట్రేషన్, అగ్నిమాపక శాఖ ఎన్‌ఓసీ లేదని ఆర్డీఓ తెలిపారు. ధరల పట్టికతో పాటు అర్హత కలిగిన ల్యాబ్‌టెక్నీషియన్, రేడియాలజిస్ట్ లేరన్నారు. సాయికృష్ణ నర్సింగ్‌హోమ్‌లో ల్యాబ్‌టెస్ట్ ధరల పట్టికను తెలుగులో ప్రదర్శించలేదని, ఫార్మసీ రికార్డులు సరిగ్గా నిర్వహించడం లేదని, 2022–23లోనే 147 అబార్షన్లు జరిగినట్లు గుర్తించామన్నారు. ఆర్‌టీ.గుప్త ఆస్పత్రిలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, బయోమెడికల్ వేస్ట్ ఎన్‌ఓసీలు లేవని, ధరల పట్టికను తెలుగులో ప్రచురించలేదని తెలిపారు. ప్రీతి, స్వప్న నర్సింగ్ హోమ్‌ల్లో ధరల పట్టికలు తెలుగులో ప్రదర్శించలేదని, రోగులు చెల్లించిన రుసుముకు రశీదులివ్వకుండా తెల్లకాగితాలపై రాసిన్నారన్నారు. లైఫ్‌లైన్, కే.బీ, సుమంత్ ఆర్థోపెడిక్ సెంటర్, పీ.ఎస్ చిల్డ్రన్స్ నర్సింగ్‌హోమ్‌ల్లో శానిటేషన్ అధ్వానంగా ఉందని, ఫైర్ ఎన్‌ఓసీ గడువు ముగిసినా రెన్యువల్ చేయించుకోలేదని, అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. అబిద్ స్కానింగ్ సెంటర్‌లో బయో మెడికల్ ఎన్‌ఓసీ గడువు ముగిసిందని, అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, రశీదుల మీద రిజిస్ట్రేషన్, జీఎస్‌టీ నెంబర్లు లేవని చెప్పారు. ప్రకాష్ డెంటల్ ఆస్పత్రి వైద్యుడు తనిఖీ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించారని పేర్కొన్నారు. తనిఖీల్లో వెలుగు చూసిన అంశాలతో కూడిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆర్‌డీఓ వెల్లడించారు.

తైక్వాండో పోటీలకు రూ.లక్ష విరాళం

తాడిపత్రి టౌన్: స్థానిక పుట్లూరు రోడ్డులోని బాలాజీ ఫంక్షన్ హాలులో శనివారం రాయలసీమ స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభయ్యాయి. వైఎస్సార్ సీపీ నాయకుడు కాకర్ల రంగనాథ్ హాజరై పోటీల నిర్వహణకు రూ.1 లక్ష విరాళం అందించినట్లు తైక్వాండో అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయి తెలిపారు. ఉమ్మడి వైఎస్సార్, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

తాడిపత్రి: వెంకటరెడ్డిపల్లిలో ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు..గ్రామానికి చెందిన గొర్ల చిన్న బాలన్న (65) అనే కౌలు రైతు తనకున్న నాలుగున్న ఎకరాలతో పాటు మరో 15 ఎకరాలను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేవాడు. పంటలు చేతికిరాకపోవడంతో అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో గొర్రెల వ్యాపారం మొదలు పెట్టాడు. అటు వ్యవసాయం, ఇటు గొర్రెల వ్యాపారానికి దాదాపు రూ.5 లక్షల వరకు చేసిన అప్పులు చేశాడు. బ్యాంకులో రూ.65 వేల వరకు అప్పు ఉంది. అప్పులు ఎలా తీర్చాలో తెలియక శనివారం పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి భార్య గంగమ్మ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా మృతుడి కుమారులు, కుమార్తెలకు ఇదివరకే వివాహాల జరిగిపోయాయి.

గాయపడిన మహిళ మృతి

తాడిపత్రి: రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళ శనివారం మృతి చెందింది. రూరల్ ఎస్ఐ వివరాల మేరకు.. ఈ నెల 18న గంగాదేవిపల్లికి చెందిన పద్మావతి(60) తాడిపత్రికి పని మీద బైక్‌పై తన కుమారుడితో కలసి బయలుదేరింది. గంగాదేవిపల్లి క్రాస్ వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఇసుక టిప్పర్ సీజ్

గుత్తి రూరల్: కొత్తపేట శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం ఇసుకను అధిక లోడ్‌తో అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను సెబ్ పోలీసులు సీజ్ చేశారు. సెబ్ పోలీసులు తెలిపిన వివరాలు.. గుత్తి సెబ్ ఎస్ఐ అలీ అహ్మద్ తన సిబ్బందితో కొత్తపేట గ్రామ శివారులో వాహన తనిఖీ చేపట్టారు. అయితే తాడిపత్రి వైపు నుంచి 18 టన్నుల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు. టిప్పర్ డ్రైవర్ నితిన్ ను అరెస్టు చేసి టిప్పర్‌ను పోలీసులకు అప్పగించారు.